క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

- సచివాలయ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఒంగోలు అర్బన్: గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్.. ఉద్యోగులందరి తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న బదిలీల ప్రక్రియకు హామీ ఇచ్చినందుకు ఉద్యోగులంతా హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఒంగోలు అర్బన్: సూర్యశ్రీ దివ్యాంగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక కర్నూలు రోడ్డులోని ట్రస్టు కార్యాలయం వద్ద పేద ముస్లింలకు దాతల సహకారంతో గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. రూ.లక్ష విలువ చేసే తోఫాను అందజేసి ముస్లింలు పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డాక్టర్ చాపల వంశీకృష్ణ, ట్రస్ట్ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ, డాక్టర్ బుద్దపాటి రాజశేఖర్, మారెళ్ల సుబ్బారావు, మండవ సుబ్బారావు, కొల్లా మధు, గొల్లపూడి శ్రీహరి, మేడికొండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త మార్గం ఆదర్శం



మాట్లాడుతున్న డాక్టర్ జవహర్

చీమకుర్తి: మహ్మద్ ప్రవక్త ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బీ జవహర్ ముస్లింలకు పిలుపునిచ్చారు. చీమకుర్తి యల్లయ్యనగర్‌లోని ముస్లింలకు స్థానిక నాయకులు గురువారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జవహర్‌తో పాటు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మాజీ ఎంపీపీ మేదరమెట్ల ఈశ్వరమ్మ, శ్రీనివాసులు ఆర్థిక సహకారంతో 75 ముస్లిం కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.550 విలువ చేసే నిత్యావసర వస్తువులను రంజాన్ తోఫా కింద అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జనరాజుపల్లి మరియమ్మ, జే యాకోబు, ముస్లింలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేస్ ప్రాంగణ ఎంపికల్లో 16 మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో మద్దిశెట్టి శ్రీధర్

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న 16 మంది విద్యార్థులు డెలాయిట్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ తెలిపారు. డెలాయిట్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో తమ కాలేజీ విద్యార్థులనే అత్యధికంగా నియమించిందన్నారు. ఆర్థిక మాంద్యం వల్ల ఫ్రెషర్స్ నియామకం తగ్గుముఖం పట్టినప్పటికీ తమ కాలేజీ ఎన్నో ఉన్నత సంస్థలతో ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తూ అత్యధిక ప్యాకేజీలతో ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించినట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ కే.రూప అభినందించారు.

మానవతను ఎలుగెత్తి చాటుదాం

ఒంగోలు టౌన్: వ్యక్తిగత సంస్కరణను పెంపొందించుకోవడమే విశ్వమానవ సంక్షేమ సంఘం ఆవిర్భావానికి ప్రధాన కారణమని మాజీ మంత్రి, జెడ్పీ మాజీ చైర్మన్ ముక్కు కాశిరెడ్డి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన విశ్వమానవ సంక్షేమ సంఘం 36వ వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. కార్యక్రమానికి సూర్యకుమారి అధ్యక్షత వహించగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పెసల మస్తాన్‌రావు, కొటారి జనార్దన్, తేళ్ల అరుణ, డాక్టర్ నూనె అంకమరావు, చావలి సుధాకర్, గురువారెడ్డి, పిన్నిక శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రైతు భరోసాకు నమోదు చేసుకోవాలి

మద్దిపాడు: రైతు భరోసా పథకానికి కొత్తగా నమోదు చేసుకునే వారికి రిజిస్ట్రేషన్లు ప్రారంభమైనట్లు మండల వ్యవసాయాధికారి కె.రమేష్ తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్, బ్యాంక్ అకౌంట్ నంబర్, ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రంలో రైతులు సంప్రదించాలని ఆయన సూచించారు.



స్విచ్ ఆన్ చేసి హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



ముస్లిం ఖబరస్థాన్ ప్రహరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న బాలినేని

శరవేగంగా నగరాభివృద్ధి

ప్రహరీ, హైమాస్ట్ లైట్లను ప్రారంభించిన ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక కొప్పోలులో ముస్లిం కబరస్థాన్ చుట్టూ నిర్మించిన ప్రహరీని గురువారం ఆయన ప్రారంభించారు. ప్రహరీ శిలాఫలకాన్ని ఆవిష్కరించి ముస్లిం మత పెద్దలతో బాలినేని ముచ్చటించారు. అనంతరం కొప్పోలు మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలతో కలిసి పాల్గొన్నారు. అదేవిధంగా కొప్పోలులో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను కూడా స్విచ్ ఆన్ చేసి బాలినేని ప్రారంభించారు. ప్రహరీ, హైమాస్ట్ లైట్లకు నగరపాలక సంస్థ రూ.23.85 లక్షలు ఖర్చుచేసిందని తెలిపారు. కబరస్థాన్‌కు ప్రహరీని అనుకున్న సమయం కంటే ముందుగానే పూర్తి చేసిన నగరపాలక సంస్థ అధికారులను అభినందించారు.

కార్యక్రమంలో కొప్పోలు ముస్లిం మత పెద్దలు మస్తాన్, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి శంకర్, జలీల్, ఎంఈ కే మాల్యాద్రి, డీఈ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఎండకు జాగ్రత్తలు తీసుకోవాలి

- తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి
- పారిశుధ్య కార్మికులకు డీపీవో నారాయణరెడ్డి సూచన



పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీపీవో నారాయణరెడ్డి

కొత్తపట్నం: మండుతున్న ఎండల దృష్ట్యా ముందు జాగ్రత్త చర్యగా తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి పారిశుధ్య కార్మికులకు సూచించారు. మండలంలోని రాజుపాలెం పంచాయతీని గురువారం ఆయన సందర్శించి పారిశుధ్య కార్యక్రమాలు, ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడగాడ్పులు ఎక్కువగా వీస్తున్నందున తాగునీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పంచాయతీలో చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామంలో తాగునీరు వంటి మౌలిక వసతులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీలో తయారు చేస్తున్న వర్మీకంపోస్టును పరిశీలించారు. సిద్ధం చేసిన వర్మీకంపోస్టును ఒక కేజీ, 5 కేజీల ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయించాలన్నారు. పాడి చెత్తను ప్రాసెస్ చేసి అమ్ముకోవాలని సూచించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం గురించి ఎస్‌హెచ్‌జీ సభ్యులు, గ్రామ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. తడి, పొడి చెత్తను ఇంటి దగ్గరే వేరు చేసి ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని వివరించారు. ఎస్‌డబ్ల్యూపీసీ దగ్గర తీగ జాతి మొక్కలు నాటి షెడ్‌పైకి అల్లించాలని చెప్పారు. వీటివల్ల షెడ్‌లోని వానపాములు చనిపోకుండా చల్లదనానికి బతికి ఉంటాయని సూచించారు. డీపీవో చేతుల మీదుగా షెడ్ పక్కనే తీగ జాతి మొక్కలు నాటారు. ఎస్‌డబ్ల్యూపీసీలో రెవెన్యూ జనరేషన్ చేసి పంచాయతీలకు ఆదాయాన్ని చేకూర్చాలని సూచించారు. పారిశుధ్య కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'మా నమ్మకం నువ్వే జగనన్న'



కరవదిలో కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



సంతనూతలపాడులో నాయకులతో సమీక్షిస్తున్న దుంపా చెంచిరెడ్డి



మంచికలపాడులో స్టిక్కర్లు అంటిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొత్తపట్నం: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ కొత్తపట్నం అధ్యక్షుడు బంకా శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కొత్తపట్నం, గమళ్లపాలెం, మడనూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయ వ్యవస్థను తీసుకురావడం జరిగిందన్నారు. ఇంటింటికెళ్లి స్టిక్కర్లు అంటించారు. మా నమ్మకం నువ్వే జగనన్న టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేశారు. కార్యక్రమంలో బండి శ్రీను, తంబి సురేష్, తంబి నరసింహారావు, పెద్ది కృష్ణారెడ్డి, ముట్టే కోటేశ్వరరావు, ఏకొల్లు నాగేశ్వరరావు, పాత్తూరి కుమార్, పురిణి పోలిరెడ్డి, ఏకొల్లు రమాదేవి, కె.పద్మ, మేరీ, ధనమ్మ, పద్మ, వలంటీర్లు పాల్గొన్నారు.

కరవది గ్రామంలో...

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామంలో మా నమ్మకం నువ్వే జగనన్న, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని గురువారం రాత్రి ఎంపీటీసీ-1 మన్నె శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ డి.కోటేశ్వరావు నిర్వహించారు. నవరత్నాల ద్వారా కరవదిలోని ప్రతి ఒక్క కుటుంబం ప్రయోజనం పొందుతోందని తెలిపారు. హైస్కూలును నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసి జూనియర్ కాలేజీ మంజూరు చేశారని, పీహెచ్‌సీకి నూతన భవన నిర్మాణం పూర్తయిందని ప్రజలకు వారు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మారెడ్డి, సుబ్బారెడ్డి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. లబ్ధిదారుల గృహాలకు జగనన్న స్టిక్కర్లు అంటించారు.



కొత్తపట్నంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రజామద్దతు పుస్తకాలపై సమీక్ష

చీమకుర్తి: జగనన్న కాలనీలలో గృహాల లబ్ధిదారుల సమాచారంతో నింపిన ప్రజామద్దతు పుస్తకాలపై వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం సంతనూతలపాడులో వైఎస్సార్ సీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా దుంపా చెంచిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దుంపా యలమందారెడ్డి ఆధ్వర్యంలో సేకరించిన ప్రజామద్దతు పుస్తకాలను పార్టీ మండల అబ్జర్వర్లు మూరబోయిన సంజీవరావు, గుడ్డపోతల రవికి అందించారు.

మంచికలపాడు పంచాయతీలో ఇంటింటికి స్టిక్కర్ల అందజేత...

చీమకుర్తి మండలం మంచికలపాడు పంచాయతీ పరిధిలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పార్టీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించిన స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ చిన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి, రాజు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు చీమకుర్తి మండల పరిషత్ సమావేశం

చీమకుర్తి: చీమకుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో జరుగుతుందని ఎంపీడీవో సీతారామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

కొత్తపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయం మండల మాస్టర్ ట్రైనర్ నరసింహులు కోరారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై గురువారం కొత్తపట్నంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ రెండు రోజుల పాటు యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తపట్నం, ఆలూరు, గాదెపాలెం, రాజుపాలెం, మడనూరు గ్రామాల్లో గ్రామ సంఘం స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిజిటల్ మాస్టర్ ట్రైనర్ పురిణి బ్రహ్మారెడ్డి, ప్రకృతి వ్యవసాయం కార్యకర్తలు, రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మే డేని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి

ఒంగోలు: మే డే కార్యక్రమంలో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పీవీఆర్ చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ 138వ మే డే వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన ఆర్థిక విధానాల కారణంగా దేశంలో కార్మికుల శ్రమదోపిడీ పెరిగిపోయిందన్నారు. పారిశ్రామికవేత్తలు, బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు పాలకులు కొమ్ముకాస్తూ కార్మికులను కట్టుబానిసలుగా మార్చేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులు, చట్టాలు హరించుకుపోయాయన్నారు. బీజేపీ హఠావో, దేశ్ కీ బచావో నినాదంతో సాగుతున్న కార్మికవర్గ పోరాటాలలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలు, హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కాలరాసిందన్నారు. దీంతో కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి ముప్పు ఏర్పడిందన్నారు. కార్మికుల యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కును కూడా కోల్పోతున్నామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా అమ్మివేస్తోందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకు కేంద్రం సిద్ధపడిందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు, ఆటో, హమాలీ, వీధి వ్యాపారులు, షాపులలో పనిచేసే కార్మికులకు ఎటువంటి చట్టాలు లేక వెట్టిచాకిరీకి గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సయ్యద్ సర్దార్, పాటిబండ్ల సిద్దయ్య, ఆటో కార్మిక సంఘ నాయకులు ఎద్దు రమేష్, మనోహర్, దాసరి గోపి తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ



బస్‌పాస్‌లు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

చీమకుర్తి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలోని బధిరుల పాఠశాలలోని దివ్యాంగులకు గురువారం ఆర్టీసీ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ సభ్యుడు పువ్వాడ లక్ష్మీనరసింహస్వామి ఆర్థిక సహకారంతో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి కోటేశ్వరరావు, మార్తల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బస్‌పాస్‌లు అందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, ముప్పూరి చలమయ్య, కడవ రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఒంగోలు రూరల్: అంబేడ్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా అంబేడ్కర్ స్టడీ సర్కిల్, జైభీమ్ యువజన సంఘం, మాస్ ఆర్గనైజేషన్ వారు కరవదిలో బుధవారం రాత్రి ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బహిరంగ సభ నిర్వహించారు. కరవది గ్రామంలోని బౌద్ధస్తూపం నుంచి మేళతాళాలతో, నృత్యాలతో బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ నగర్‌లోని కళాప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహించారు. సర్పంచ్ డి.కోటేశ్వరరావు, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీపతిరాములు, విద్యావేత్త డాక్టర్ నూకతోటి రవికుమార్, జిల్లా ఐద్వా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, విద్యుత్ డీఈ రఘుబాబు పాల్గొని ప్రసంగించారు. తొలుత అంబేద్కర్ గేయాలను జైభీమ్ కళామండలి కట్టెడ నాగరాజు ఆలపించారు. ఆయా కార్యక్రమాలలో బెజ్జం దయానందం, మాస్ అధ్యక్షుడు జి.శివాజీ, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ వాకా కృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. మార్క్‌ఫెడ్, కరవది సొసైటీ తరఫున ప్రారంభించిన ఈ కేంద్రంలో గురువారం రాత్రి 8 గంటల వరకు 600 క్వింటాల శనగలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ వాకా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రధాన లక్ష్యంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మండలంలోని కరవది, చేజర్ల, ఉలిచి, దేవరంపాడు, వలేటివారిపాలెం, త్రోవగుంట, ముక్తినూతలపాడు గ్రామాల రైతులు పండించిన శనగలను సొసైటీ ద్వారా గిట్టుబాటు ధరకు ఈ కేంద్రంలో అమ్ముకోవచ్చన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో బి.రామాంజనేయులు, మాజీ వైస్ ఎంపీపీ అంచిపోగు రమేష్‌బాబు, మాజీ ఎంపీటీసీ కైలా శ్రీనివాసరావు, కోటు వెంకటశేషయ్య పాల్గొన్నారు.

రూ.33 లక్షలతో 7 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు



చీమకుర్తి పట్టణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చీమకుర్తి: లో ఓల్టేజీ సమస్య పరిష్కరించే క్రమంలో చీమకుర్తి పట్టణం, మండలంలోని గ్రామాల్లో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.33 లక్షలతో 7 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గురువారం ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రికల్ ఏఈ వేమవరపు శ్రీనివాసరావు తెలిపారు. చీమకుర్తి పట్టణంలోని ఎంఎస్ఆర్ జూనియర్ కాలేజీ సమీపంలో రూ.6 లక్షలతో 160 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్టీఆర్ నగర్‌లో రూ.6 లక్షలతో 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, పాత సినిమా హాలు వద్ద రూ.5 లక్షలతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద రూ.5 లక్షలతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, గాంధీనగర్ మూడో లైన్‌లో రూ.5 లక్షలతో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, పల్లామల్లి గ్రామంలో రూ.4.50 లక్షలతో 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, కంచువారివీధిలో రూ.1.50 లక్షలతో 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చినట్లు ఏఈ వివరించారు. వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా 7 అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చినట్లు తెలిపారు.

వైభవంగా మహాసామ్రాజ్య పట్టాభిషేకం



మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో పాల్గొన్న కంచి పీఠాధిపతి

ఒంగోలు టౌన్: స్థానిక గడియారంవారివీధిలో వెలసిన పురాతన దేవాలయంలో ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి నిర్వహణలో ఉన్న సీతా సమేత శ్రీ అనంత కోదండరామస్వామి మందిరంలో గురువారం అత్యంత వైభవంగా మహా సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి సమక్షంలో వేద పురోహితులు, ఆలయ అర్చక స్వాములు భక్తిశ్రద్ధలతో ఈ కార్యక్రమాన్ని జరిపారు. బ్రాహ్మణ సేవా సమితి నిర్వాహకుడు సుబ్బయ్యశర్మ, వేద పండితులు కంచి పీఠాధిపతి మహాస్వామికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో కొలువై ఉన్న సీతా సమేత అనంత కోదండరామస్వామి, లక్ష్మణ ప్రసన్నాంజనేయస్వామికి మంగళ హారతులిచ్చారు. భక్తులకు రాములవారి పట్టాభిషేకం వైభవాన్ని సవివరంగా తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి పట్టాభిషేకాన్ని తిలకించారు.

మహాస్వామి ఆశీసులు అందుకున్న శిద్దా...

ఒంగోలు: కంచి పీఠాధిపతి ఆశీసులను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అందుకున్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీ మహాలక్ష్మి నిలయంలో మహాస్వామిని శిద్దా దంపతులు దర్శించుకుని ఆశీసులు పొందారు. మహాత్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి వారి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రైల్వేకు భూములను పరిశీలించిన జేసీ



కరవది రైల్వే గేటు వద్ద భూములు, రికార్డులు పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు రూరల్: రైల్వే అవసరాల కోసం మండలంలోని కరవదిలో భూ సేకరణకు అవసరమైన భూములను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం ఉదయం పరిశీలించారు. విజయవాడ నుంచి గూడూరు వరకు దక్షిణ మధ్య రైల్వే మూడో లైన్ నిర్మాణం చేపట్టింది. ఈ నిర్మాణ పనుల్లో భాగంగా 645-2బీ1 సర్వే నంబర్‌లో 20 సెంట్ల భూ సేకరణకు ఇళ్ల స్థలాల భూమిని ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు మండల తహసీల్దార్ పి.మురళితో కలిసి జేసీ పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ డి.కోటేశ్వరరావు, ఈవోఆర్డీ పూర్ణచంద్రరావు, కార్యదర్శి వేమా శ్రీలక్ష్మి, వీఆర్వోలు శ్రీనివాసమూర్తి, జగదీష్‌బాబు, రైల్వే ఇంజినీర్ సురేష్ పాల్గొన్నారు.

విద్య ద్వారానే విజ్ఞానం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సోమశేఖర్

ఒంగోలు: విద్య ద్వారా విజ్ఞానాన్ని పెంచుకుందామని, తద్వారా వ్యక్తిగతంగా ఉన్నత స్థానానికి చేరుకోవడంతో పాటు సమాజానికి చేయూతనివ్వగలిగే స్థాయికి చేరుకోవడం సాధ్యపడుతుందని ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, ప్రొఫెసర్ జి.సోమశేఖర్ అన్నారు. స్థానిక నాగార్జున డిగ్రీ, పీజీ కాలేజీలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో 10 కోర్సులు ఉన్నాయని, వాటితోపాటు అనుభవజ్ఞులైన ఆచార్యులు ఉన్నారని తెలిపారు. పీజీ సెట్‌లో ఉత్తీర్ణత పొందిన వారికి మాత్రమే ప్రభుత్వ ఉపకార వేతనాలు అందుతాయన్నారు. డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ మాట్లాడుతూ విద్యతో పాటు ఎన్ఎస్ఎస్‌లో కూడా చేరడం ద్వారా ఉద్యోగావకాశాలు పెంచుకునే అవకాశం కలుగుతుందన్నారు. యూనివర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరరెడ్డి, డాక్టర్ పి.వెంకట్రావు, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ విజయ్‌కుమార్, నాగార్జున విద్యా సంస్థల ప్రిన్సిపాల్ సి.వసంతలక్ష్మి వివిధ కోర్సుల ప్రాధాన్యతను వివరించారు.

ఆధునిక పద్ధతిలో ఆపరేషన్

ఒంగోలు అర్బన్: స్థానిక అరవింద్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎండోసోనోగ్రామ్ అనే అత్యాధునిక పరికరాలతో ఆధునిక పద్ధతిలో ఎటువంటి కోత లేకుండా విజయవంతంగా ఆపరేషన్ చేసినట్లు హాస్పిటల్ అధినేత డాక్టర్ మందలపు నరేంద్రబాబు తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి ఆ వివరాలు వెల్లడించారు. 24 సంవత్సరాల యువకుడు తీవ్రమైన కడుపునొప్పితో హాస్పిటల్‌కు వచ్చాడని, ప్యాంక్రియాస్ సమస్య ఉన్నట్లు గుర్తించి అత్యాధునిక యంత్రాలతో ఎటువంటి కోత, కుట్టు లేకుండా ఆపరేషన్ చేశామన్నారు.